

తమ గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతంలోకి పాంపల్లి గ్రామస్తులు ప్రవేశించకుండా రహదారిని తొలగిస్తున్న కంచన్‌పల్లి వాసులు

కరెంటు స్తంభాలు తెచ్చిన తంటా

రెండుళ్ల మధ్య చిచ్చు

నాటిన విద్యుత్ స్తంభాలను తొలగించిన ఓ గ్రామవాసులు

ప్రతిగా రహదారిని తవ్వేసిన మరో గ్రామస్థులు

కొడిపల్లి, జూలై 9: ఓ కంపెనీకి కరెంట్ సరఫరా లైన్ ఏర్పాటు విషయం రెండు గ్రామాల మధ్య వైరంగా మారింది. మెదక్ జిల్లా కంచన్‌పల్లి గ్రామానికి చెందిన బాలకిషన్‌రావు రెండు సంవత్సరాల క్రితం ధర్మసాగర్ శివారులోని టీఎస్‌ఐపాస్‌లో ఓ చిన్నతరహా పరిశ్రమ ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకుని అన్ని అనుమతులు తీసుకున్నారు. కరెంటు కనెక్షన్ కోసం విద్యుత్‌శాఖకు రూ. 25 లక్షలు చెల్లించారు. విద్యుత్‌శాఖ అధికారులు సర్వేచేసి ప్రతిపాదన చేయగా దీనిపై పొరుగున ఉన్న పాంపల్లి గ్రామస్థులు అడ్డుకుంటున్నారు. పొలాల గుండా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయగా



రోడ్డు వెంట పాతిన విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న అర్అండ్‌బీ డీఈ శ్రీనివాస్

రైతులు అడ్డుకున్నారు. పాంపల్లి గ్రామం గుండా లైన్ వేయడానికి ప్రయత్నించగా గ్రామానికి కొందరు యువకులు అడ్డుకున్నారు. పాతిన స్తంభాలను తొలగించారు. దీంతో కంచన్‌పల్లి గ్రామస్థులు ఆగ్రహంచెందారు. తమ గ్రామానికి చెందినవారికి కరెంట్ కనెక్షన్ ఇవ్వకుండా అడ్డుకుంటున్న పాంపల్లి గ్రామస్థులపై మండిపడ్డారు. కంచన్‌పల్లికి చెందిన పలువురు కలిసి రెండు గ్రామాల మధ్య అటవీ ప్రాంతం గుండా ఉన్న రోడ్డును జేసీబీతో తవ్వించారు. అలాగే, పాంపల్లి సోమన్ కుంటకు అటవీ ప్రాంతం నుంచి నీళ్ల వచ్చే మార్గాలకు అడ్డుగా కాల్వ తవ్వి తమ గ్రామంలోని చెరువలోకి మళ్లించారు. దీంతో ఇరు గ్రామాల మధ్య వివాదం మరింత ముదిరింది. ఇదే విషయంలో వారం రోజుల క్రితం కంచన్‌పల్లి గ్రామస్థులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న అర్అండ్‌బీ డీఈ శ్రీనివాస్ గ్రామనికి చేరుకుని విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. రోడ్డు పక్కనే కరెంటు స్తంభాలు వేస్తే భవిష్యత్తులో రహదారి వెడల్పు చేయడానికి అడ్డంకిగా మారుతుందని పేర్కొన్నారు. రోడ్డు నుంచి 5 మీటర్ల దూరంలో స్తంభాలను వేసుకోవాలని సూచించారు. సదాశివపల్లి పంచాయతీ కార్యదర్శి రేణుక సైతం స్తంభాల ఏర్పాటును పరిశీలించారు. విద్యుత్ స్తంభాలు ఎక్కడి నుంచి వేసుకున్నా తమకు అభ్యంతరం లేదని, రోడ్డు వెంబడి నాటిన మొక్కలను తొలగించకుండా చూడాలని సూచించారు.

ఎరుకజెప్పిన ఎలుక..!

సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూలో సమస్యల తిష్ఠ

మొన్న కుళ్లిన కూరగాయలు.. తాజాగా చట్నీలో ఎలుక

- నాణ్యత లేని ఆహారం.. శుభ్రత లేని మెస్‌లు
- పట్టించుకోని యంత్రాంగం.. తీరు మార్చుకోని అధికారులు
- అర్ధాకలితో చదువు పక్కదారి పడుతున్నదని విద్యార్థుల మొర
- విచారణాధికారుల ఎదుట ఫిర్యాదుల వెల్లువ





పల్లి చట్నీ పాత్రలో తిరుగుతున్న ఎలుక

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 9: ప్రతిష్ఠాత్మకమైన జేఎన్‌టీయూ విద్యాసంస్థ వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నది. హాస్టల్ విద్యార్థులకు అందిస్తున్న ఆహారంపై నిరంతరం నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం టిఫిన్‌లోకి తయారు చేసిన పల్లి చట్నీలో ఎలుక ఈత కొడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. సంగారెడ్డి అడిషనల్ కలెక్టర్ మాధురి, హైదరాబాద్ జేఎన్‌టీయూ రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి సదరు చట్నీని ప్రత్యక్షంగా పరిశీలించారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలతో విచారణ చేపట్టగా కళాశాల హస్టల్‌లో దారుణ పరిస్థితులు వెలుగులోకి వచ్చాయి. వర్ణనాతీతమైన విద్యార్థుల బాధలు వెలుగుచూశాయి. తాము ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని.. నేడు ఎలుక కారణంగానైనా తమ సమస్యలు చెప్పుకునే అవకాశం వచ్చిందని విద్యార్థులు వాపోయారు.

1,400 మంది విద్యార్థులు

సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్‌లోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలను 2014లో ప్రారంభించారు. ప్రస్తుతం బీటెక్, ఎంటెక్, బీఫార్మసీ, ఎంఫార్మసీ కోర్సులను నిర్వహిస్తున్నారు. అమ్మాయిలు, అబ్బాయిలకు వేర్వేరు హస్టళ్లు, వేర్వేరు మెస్‌లు ఉన్నాయి. దాదాపు 1,400 మంది విద్యార్థులు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. బోధనలో మంచి మార్కులే పడుతున్నా ఆహార విషయంలో అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అపరిశుభ్రం.. అస్తవ్యస్తం

హాస్టల్ మెస్‌లు అపరిశుభ్రంగా ఉన్నట్టు ఇటీవల వెలుగులోకి వచ్చింది. పది రోజుల క్రితం ఫుడ్ సేఫ్టీ అధికారులు చేపట్టిన తనిఖీల్లోనూ విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. కాలం చెల్లిన మైదా, పాడైన కూరగాయలను వినియోగిస్తున్నట్టు గుర్తించి వాటిని పారబోయించారు. కిచెన్, పాత్రలు కడిగే ప్రదేశంలో శుభ్రత దారుణంగా ఉన్నట్టు గుర్తించారు. దీంతో అధికారులు బాధ్యులకు నోటీసులు జారీ చేశారు. పది రోజుల్లోనే మరోసారి విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. విద్యార్థులకు ఉదయం అల్పాహారంలోకి ఇచ్చే పల్లి చట్నీ పాత్రలో ఎలుక పడిన దృశ్యాలు వైరల్‌గా మారాయి.

చట్నీపాత్రలో ఎలుక చక్కర్లు కొడుతున్న వీడియోలు వెలుగులోకి రావడంతోనే అందరి దృష్టి పడిందని విద్యార్థులు వాపోతున్నారు. మెస్ కాంట్రాక్టర్, కేర్ టేకర్లు, వంట సిబ్బంది నిర్లక్ష్యంతో పరిస్థితి ఇలా రోజురోజుకూ దారుణంగా మారుతున్నదని వారు ఆరోపిస్తున్నారు. కుళ్లిపోయిన కూరగాయలు, నాణ్యతలేని సరుకులతో ఆహారం వండుతున్న విషయంపై కాలేజీ అధికారులు, ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని వాపోతున్నారు.

ఫిర్యాదు చేస్తే పనిష్మెంట్!

జేఎన్‌టీయూలో సమస్యలను చెప్పుకోలేని వాతావరణం ఉన్నదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలను ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లే పరిస్థితి లేదని ఆవేదన చెందుతున్నారు. మెస్ నిర్వహణ, హస్టల్‌లో వసతులు, నాణ్యతలేని భోజనం గురించి ఎవరైనా ఫిర్యాదు చేస్తే సదరు విద్యార్థులపై కక్షసాధింపుకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. క్యాంపస్‌లో పరిస్థితిపై విద్యార్థులను కదిలించగా.. పలువురు తమ గోడు వెల్లబోసుకున్నారు. కానీ, తమ పేర్లు గోప్యంగా ఉంచాలని, లేదంటే అకాడమిక్ పరంగా ఇబ్బందులు పెడతారని వేడుకున్నారు. సమస్యల గురించి ఎవరైనా మాట్లాడితే పనిష్మెంట్ తప్పదని వారు వాపోయారు. అందుకే అన్నం వాసన వచ్చినా, మధ్యాహ్నం వండిన అన్నాన్ని రాత్రి వడ్డించినా, చికెన్ ఉడకకున్నా, మజ్జిగ, సాంబారు నీళ్లలా ఉన్నా భరిస్తున్నామని విద్యార్థులు చెప్పారు. కానీ, ఆకలి బాధతో చదువుపై దృష్టిపెట్టలేకపోతున్నామని పలువురు 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు.

అడిషనల్ కలెక్టర్ తనిఖీ

జేఎన్‌టీయూ ప్రాంగణాన్ని మంగళవారం సంగారెడ్డి అడిషనల్ కలెక్టర్ మాధురి తనిఖీ చేయగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కాలేజీ హస్టళ్లను, మెస్‌లను ఆమె పరిశీలించారు. అపరిశుభ్ర పరిస్థితులను చూసి కేర్ టేకర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేర్వేరుగా అమ్మాయిలు, అబ్బాయిలతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సమస్యలను మొరపెట్టుకున్నారు. అదేవిధంగా జేఎన్‌టీయూ హైదరాబాద్ నుంచి వచ్చిన అధికారులకూ ఫిర్యాదు చేశారు. వారు విద్యార్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయగా పోటీపడి తమ సమస్యలను వివరించే ప్రయత్నం చేశారు. మెస్ బిల్లులు, నాణ్యత లేని ఆహారం, హాస్టల్‌లో ఇబ్బందులు, స్కాలర్‌షిప్ సమస్యలను వారి దృష్టికి తెచ్చారు.





పాడైన అన్నాన్ని చూపిస్తున్న విద్యార్థిని, నాసిరకం అల్లం వాడడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అదనపు కలెక్టర్ మాధురి, అధికారులతో సమస్యలు చెప్పుకుంటున్న విద్యార్థులు

సదరానికి పోటెత్తారు..



సదరం క్యాంపునకు తరలివచ్చిన దివ్యాంగులు

- జాతరను తలపించిన ఆస్పత్రి ప్రాంగణం
- కిక్కిరిసిన ఓపీ గదుల ప్రాంగణం
- సామాన్య రోగులు ఇబ్బందులు
- పరీక్షలు పూర్తయినా సర్టిఫికెట్ కోసం తప్పని ఎదురుచూపులు

సంగారెడ్డి అర్బన్, జూలై 9 : దివ్యాంగులను గుర్తించేందుకు నిర్వహించిన సదరం క్యాంపునకు దివ్యాంగులు పోటెత్తారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన సదరం క్యాంపునకు జిల్లా నలుమూలల నుంచి దివ్యాంగులు తరలివచ్చారు. పెద్దసంఖ్యలో తరలిరావడంతో వారిని కట్టడి చేసేందుకు ఆస్పత్రి సిబ్బంది శ్రమించాల్సి వచ్చింది. గతంలో అనర్హులుగా ప్రకటించినా అవగాహనలేక మళ్లీమళ్లీ వస్తుండడంతో రద్దీ పెరిగిపోతున్నది. క్యాంపు సిబ్బంది మీసేవా ద్వారా స్లాట్ బుక్ చేసుకున్న దివ్యాంగులనే అనుమతించారు. స్లాట్ బుకింగ్ లేకుండా వచ్చినవారిని తిరిగి పంపించేశారు. దివ్యాంగుల వైకల్యాన్ని ఆయా స్పెషాలిటీల డాక్టర్లు పరీక్షించి అర్హులు, అనర్హుల వివరాల వివరాలను నమోదు చేశారు. అయితే, ఆస్పత్రి ఓపీ విభాగాల్లోనే సదరం క్యాంపు నిర్వహించడంతో సామాన్య రోగులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ఈ రద్దీని చూసి పలువురు సాధారణ రోగులు వెనుదిరిగి వెళ్లారు.

మూడు శాఖల ప్రమేయం

మూడు శాఖల ఆధ్వర్యంలో సదరం క్యాంపు నిర్వహిస్తుంటారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో)తో పాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి అధికారులు, డాక్టర్ల సహకారం కావాల్సి ఉంటుంది. ఇదివరకు డీఆర్‌డీవో, ప్రభుత్వ ఆస్పత్రి అధికారులు, డాక్టర్ల సహకారంతో క్యాంపు నిర్వహించే వారు. గతేడాది డీఆర్‌డీవో శాఖ బాధ్యతలను కొన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు అప్పగించడంతో అప్పటి నుంచి ఆరోగ్య శాఖ ప్రమేయం కూడా ఇందులో చేర్చారు. క్యాంపు నిర్వహించాలంటే ముందుగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ స్లాట్ తేదీలను ఖరారు చేసి డీఆర్‌డీవోకు సమాచారం ఇస్తుంది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ వారు సదరం స్లాట్స్ ఆన్‌లైన్‌లో పెడతారు. దివ్యాంగులు సదరు స్లాట్ తేదీ అనుగుణంగా స్లాట్ బుక్ చేసుకుని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి డాక్టర్ల వద్దకు వస్తారు. అక్కడ డాక్టర్లు వైకల్యాన్ని పరీక్షించి సంబంధిత డాకర్లు, ఆస్పత్రి అధికారుల సంతకాలతో కూడిన సదరం సర్టిఫికెట్ సిద్ధమతుంది. ఆ సర్టిఫికెట్లు డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి తిరిగి డీఆర్‌డీవో శాఖకు, అక్కడి నుంచి ఎంపీడీవో కార్యాలయాలకు, అక్కడి నుంచి దివ్యాంగుడికి సర్టిఫికెట్ చేరవేస్తారు.

సర్టిఫికెట్ల కోసం ఎదురుచూపులు

ప్రతీ నెలా సదరం క్యాంపు నిర్వహిస్తున్నప్పటికీ ధ్రువపత్రాలను సకాలంలో అందించడం లేదని దివ్యాంగులు ఆరోపిస్తున్నారు. రెండు, మూడు నెలలు ఎదురుచూపులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన సదరం క్యాంపునకు హాజరై అర్హులుగా గుర్తించిన 22 మంది దివ్యాంగులకు సంబంధించిన సర్టిఫికెట్లు సాంకేతిక కారణాలతో ఇప్పటికీ జారీ కాలేదు. దీంతో వారంతా ఆయా శాఖల అధికారుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు.



సదరం క్యాంపులో పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

రైతు బీమా

కొనసాగేనా?



- ఆగస్టు రెండో వారంతో ముగియనున్న పాలసీ
- కొనసాగింపుపై వెలువడని ఉత్తర్వులు

మెదక్, జూలై 9. బాధిత రైతు కుటుంబాలకు ఆర్థిక చేయూత నిచ్చేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బీమా పథకం పాలసీ గడువు వచ్చే ఆగస్ట్ 15తో ముగుస్తుంది. కానీ, ఈసారి ఇప్పటివరకూ రైతుబీమా పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు వెలువడలేదు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తొలినాళ్లలోనే రైతుబీమా పథకాన్ని కొనసాగించేందుకు మొగ్గుచూపుతున్నట్లు ప్రకటించింది. ఈమేరకు రూ.1,500 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపింది. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి ఏలాటి మార్గదర్శకాలు వెలువడలేదని వ్యవసాయశాఖ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో రైతుల్లో ఈ పథకం కొనసాగింపుపై సందిగ్ధత నెలకొంది.

రైతుబీమా పథకాన్ని నాటి రాష్ట్ర ప్రభుత్వం 2018-19 ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద 18-59 సంవత్సరాల మధ్య వయస్సు వారైన పాస్ పుస్తకాలు కలిగిన రైతులను పథకానికి అర్హులుగా గుర్తించారు. జిల్లాలో పథకం ప్రారంభించిన తొలి సంవత్సరం 708 మంది రైతులు మరణించారు. వారికి సంబంధించిన నామినీలకు రూ. 35.40 కోట్లు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చెల్లించింది. 2019-20 సంవత్సరంలో మరణించిన 871 రైతు కుటుంబాలకు రూ.43.55కోట్లు, 2020-21 సంవత్సరంలో 1,410 రైతులు మృతి చెందగా వారి కుటుంబాలకు రూ.70.60 కోట్లు, 2021-22 సంవత్సరంలో 1,176 మంది రైతులు మృతి చెందగా వారి సంబంధీకులకు రూ.358.80 కోట్లు, 2022-23 సంవత్సరంలో 1,213 మంది రైతులు మరణించగా వారి కుటుంబాలకు రూ.60.65 కోట్లు, 2023-24 సంవత్సరానికి 980 మంది మరణించిన రైతు కుటుంబాలకు రూ.49 కోట్లు ఒక్కో రైతు ఖాతాలో రూ.5 లక్షల చొప్పున భీమా పరిహారాన్ని జమచేశారు.

ప్రభుత్వమే ప్రీమియం చెల్లింపు

రైతు చనిపోతే వారి కుటుంబ సభ్యులను ఆర్థికంగా ఆదుకోవడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఇందుకోసం రైతు పేరిట బీమా చేస్తూ ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేలా జీవిత బీమా సంస్థతో నాటి ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. 2021 సంవత్సరంలో రూ.4,110, 20222లో రూ.3,829, 2023లో రూ. 3,600 చొప్పున 18 నుంచి 59 సంవత్సరాల వయసున్న రైతుల తరఫున బీమా ప్రీమియం చెల్లించింది. రైతు మృతిచెందితే రూ.5 లక్షలు పరిహారం బ్యాంకు ఖాతాలో జమయ్యేలా చర్యలు చేపట్టింది. ఈ ఏడాదికి సంబంధించి బీమా పాలసీ గడువు ఆగస్టు మాసంలో ముగియనుంది. కానీ, కొనసాగింపుపై ప్రభుత్వం నుంచి ఇంకా మార్గదర్శకాలు వెలువడక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎంతో ప్రయోజనకరంగా ఉన్న రైతు బీమాను కొనసాగించాలని రైతులు కోరుతున్నారు.

బైక్‌ను లారీ ఢీకొడ్డంతో ఇద్దరి మృతి

చేంగుంట, జూలై 9: ఎదురుగా వస్తున్న బైక్‌ను అతివేగంగా వస్తున్న లారీ ఢీకొనడంతో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన మెదక్ జిల్లా చేగుంట మండల పరిధిలోని వడియారం గ్రామ శివారు రామంతపూర్ మూల మలుపు వద్ద మంగళవారం చోటుచేసుకున్నది. ఎస్ఐ బాల్‌రాజు, కుంటుంబీకులు తెలిపిన వివరాల మేరకు తూప్రాన్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన జైపాల్‌రెడ్డి పొరుగు రాష్ట్రాలకు చెందిన లేబర్‌ను తీసుకొచ్చి చుట్టుపక్కల గ్రామాల్లో వ్యవసాయ పనులను గుత్తాకు తీసుకొని చేయిస్తాడు. పనులు చేయించేందుకు జైపాల్ రెడ్డి కూలీలను బైక్‌పై తీసుకెళ్తున్న క్రమంలో అతివేగంతో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది ఈ ఘటనలో జైపాల్ రెడ్డి, (47) అక్కడిక్కడే మృతి చెందాడు. బైక్‌పై కూర్చున్న బీహార్ రాష్ట్రానికి చెందిన కూలీలు శంభు మండల్, హర్షత్ మండల్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108లో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలిస్తుండంగా మార్గమధ్యలో శంభు మండల్ (45) మృతి చెందాడు. మృతుడు జైపాల్‌రెడ్డి నాగులపల్లి బీజేపీ అధ్యక్షుడు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.




జైపాల్‌రెడ్డి (ఫైల్) శంభు మండల్

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు : కలెక్టర్

సంగారెడ్డి అర్బన్, జూలై 9 : లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి హెచ్చరించారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో లింగ నిర్ధారణ చట్టంపై జిల్లాస్థాయి మల్టీ మెంబర్ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ఎవరైనా లింగనిర్ధారణ చేస్తే 3 నుంచి 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తారని తెలిపారు. ఎక్కడైనా లింగ నిర్ధారణ తెస్తున్నట్లు తెలిస్తే జిల్లా వైద్యాధికారికి తెలియజేయాలని కోరారు. పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌పై ప్రజలకు అవగాహన కల్పించేలా హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 125 స్కానింగ్ సెంటర్లకు అనుమతి ఉన్నాయని, కొత్తగా 11 సెంటర్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్నట్లు, రెన్యువల్ కోసం 13 సెంటర్లు దరఖాస్తు చేసినట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవి తెలిపారు. అనంతరం పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ రూపేశ్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వనజా రెడ్డి, వైద్యాధికారులు, అధికారులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ క్రాంతి

నాలుగు ఉద్యోగాలు సాధించిన

సరస్వతీ పుత్రుడు

కల్హేర్, జూలై 9: మూరుమూల గిరిజన తాండాలో పుట్టిన యువకుడు నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. గ్రూప్ వన్ ప్రిలిమ్స్‌లోనూ ఉత్తీర్ణత సాధించాడు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని కల్వోనికుంట తాండ గ్రామపంచాయితీకి చెందిన రమావత్ దశరథ్, సోనిబాయిల కుమారుడైన కిరణ్‌కుమార్ సోమవారం తెలంగాణ ప్రభుత్వం ప్రకటించి జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో ఉద్యోగం సాధించాడు. అంతకుముందు డిగ్రీ లెక్చరర్, గ్రూప్ 4, ఎక్సైజ్ కానిస్టేబుల్, 2019లో యూజీసీ జేఆర్‌ఎఫ్‌లో అర్హత సాధించాడు. కిరణ్‌కుమార్ ప్రస్తుతం ఉస్మానియా వర్సిటీలో ఎకానమిక్స్‌లో పీహెచ్‌డీ చేస్తున్నాడు. అయితే, కిరణ్‌కుమార్ సివిల్స్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు.



కిరణ్‌కుమార్

ఆరుబయట వంట.. ఎన్నాళ్లు ఈ తంటా..!

● ప్రభుత్వ బడులలో వంట గదులు లేక ఇబ్బందులు



కోహీర్‌లోని ప్రాథమిక పాఠశాలలోని వరండాలో వంట వండుతున్న దృశ్యం

కోహీర్, జూలై 9: కోహీర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండేందుకు వంట గదులు లేక నిర్వాహకులకు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా చాలాచోట్ల వంట గదులు లేని పరిస్థితి. ఉపాధిహామీ నిధులు కేటాయించినా.. గదుల నిర్మాణంలో పురోగతి లేదు. దీంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాఠశాల ఆవరణలో వంట చేయడంతో తరగతి గదుల్లోకి పొగ చూరి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందిపడుతున్నారు. కోహీర్ మండలంలో 44 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 8 ఉన్నత, 8 ప్రాథమికోన్నత, 28 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 3,0124 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే గతంలో పాఠశాలల వంట గదుల నిర్మాణాలకు ఉపాధిహామీ నిధులను మంజూరు చేసింది. అప్పట్లో కొన్ని పాఠశాలలో వంట గదులు నిర్మించినా.. అవి వంటలు చేసేందుకు అనుకూలంగా లేకపోవడంతో వృథాగా పడి ఉన్నాయి. మిగతా పాఠశాలలో నిర్మించకపోవడంతో ఆరుబయటనే వండుతున్నారు. కొన్ని పాఠశాలల్లో చెట్ల కిందనే చేపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి అన్ని పాఠశాలల్లో వంట గదులను నిర్మించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేయాలి

● నిబంధనల ప్రకారం ఉద్యోగుల బదిలీలు పూర్తి చేయాలి
● రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతి, అధికారులు

సంగారెడ్డి అర్బన్, జూలై 9: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి వనమహోత్సవం, మహిళా శక్తి, సీజనల్ వ్యాధులు, ఉద్యోగుల బదిలీలు తదితరల అంశాలపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 20 కోట్లకుపైగా మొక్కలు నాటే లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. జిల్లాలవారీగా కేటాయించిన లక్ష్యాలను సాధించాలని, గ్రామాలకు అవసరమైన మొక్కలను నాటాలని, ప్రతి మొక్కకు జియోట్యాగింగ్ చేయాలని సూచించారు. సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో పారిశుధ్యం ముఖ్యమని, కిచెన్, టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉండాలని, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, డెంగీ, మలేరియా, అతిసారా వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. పీహెచ్‌సీ డాక్టర్లు, ఆశా, ఎఎన్ఎం, సిబ్బంది క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా ఉండాలని, ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉండాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనుల్లో పూర్తి కాని పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. 20లోగా నిబంధనలు పాటిస్తూ ఉద్యోగుల బదిలీలు పూర్తిచేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్‌వో పద్మజారాణి, డీఆర్‌డీవో జ్యోతి, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, డీఎఫ్‌వో శ్రీధర్, డీపీవో సాయిబాబ, డీఈవో వెంకటేశ్వర్లు, సోషల్ వెల్ఫేర్ డీడీ అఖిలేష్‌రెడ్డి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వెల్దుర్తిలో బోనాలను ఊరేగిస్తున్న మహిళలు

ఎల్లమ్మ దీవెనలతో సుభిక్షంగా ఉండాలి

● టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి

వెల్దుర్తి, జూలై 9: రేణుకాఎల్లమ్మ దీవెనలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని రేణుకాఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ బోనాలు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. ఆలయాలు ప్రశాంతతకు నిలయాలని, ప్రతిఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలని వారు సూచించారు. అలాగే మండల కేంద్రమైన వెల్దుర్తిలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మతల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. బోనాలను డప్పువాయిద్యాలతో ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఆటాపాటలు, డీజే చప్పుళ్ల మధ్య శివసత్తుల పూనకాలు, నృత్యాలు చేస్తూ బోనాలతో ఆలయానికి చేరుకున్నారు. అంతకు ముందు ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ వెల్దుర్తి మండలాధ్యక్షుడు మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎల్లమ్మదేవికి ఘనంగా బోనాలు

రేగోడ, జూలై 9: ఆషాఢమాసం పురస్కరించుకొని రేగోడు మండలం చౌదర్‌పల్లి గ్రామంలో మంగళవారం ఎల్లమ్మదేవికి ఘనంగా బోనాలు తీశారు. గ్రామంలోని పోతురాజుల నృత్యాలు, బ్యాండ్ మేళాలతో ఆలయానికి బోనాలను సమర్పించారు.



రేగోడులో బోనాలు తీస్తున్న మహిళలు



బోనాల ఊరేగింపులో రాజిరెడ్డి



ఎల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కావద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను

నంగునూరు, జూలై 9: విద్యార్థులు చెడు అలవాట్లకు బానిస కావొద్దని, చదువుపై దృష్టిసారించాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను అన్నారు. మంగళవారం నంగునూరు మండలం నర్మెట హైస్కూల్‌లో నూతన చట్టాలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయులు, సిద్దిపేట షీటీమ్ బృందం కిషన్, ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుళ్లు మమత, వీణకుమారి, కానిస్టేబుళ్లు ప్రవీణ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాగి చక్కెర కర్మాగారం సీడీసీ చైర్మన్‌గా శాదుల్



శాదుల్

నారాయణఖేడ్, జూలై 9: కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం పరిధిలోని మాగి గాయత్రి షుగర్స్ లిమిటెడ్ కెన్ డెవలప్‌మెంట్(సీడీసీ) చైర్మన్‌గా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కంగ్టి మండలం జంగి.బి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎండీ.శాదుల్‌ను నియమిస్తూ షుగర్ కెన్ కమిషనర్ డాక్టర్ జి.మల్సూర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. శాదుల్ సీడీసీ చైర్మన్‌గా మూడేళ్లపాటు పదవిలో కొనసాగుతారని పేర్కొన్నారు. సీడీసీ కమిటీలో చైర్మన్‌గా శాదుల్, కంపెనీ ప్రతినిధులు వేణుగోపాల్‌రావులను నియమిస్తూ ప్రొసీడింగ్ నెం.ఎం/216/2024 ద్వారా ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా శాదుల్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ఐటీ, భారీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, నారాయణఖేడ్, జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి ఎమ్మెల్యేలు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, లక్ష్మీకాంతారావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మదన్‌మోహన్‌రావు, జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. తాను మాగి చక్కెర కర్మాగారం పరిధిలోని చెరకు రైతుల అభివృద్ధి, సంక్షేమానికి శాయశక్తులా కృషి చేస్తానని వివరించారు.

బాలిక మృతి కేసులో పలువురికి రిమాండ్

వెల్దుర్తి, జూలై 9: మండల కేంద్రమైన వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని శేరి గ్రామానికి చెందిన కౌడె పావని మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన కేసులో పలువురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నవతాగౌడ్ మంగళవారం తెలిపారు. శేరి గ్రామానికి చెందిన కౌడె శ్రీనివాస్, యాదమ్మ కూతురు పావనిని నానమ్మ కౌడే బాలమ్మ, మేనత్త మంజులలు తీవ్ర దుర్భాషలాడడంతో తీవ్ర మనస్తాపానికి గురైన పావని మే 22న ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పావని మృతికి కారణమైన నానమ్మ, మేనత్తలతో పాటు వారిని కొట్టిన మరో ఐదుగురు చేకూరి రమేష్, కుర్మ మహిపాల్, కౌడే యాదగిరి, కౌడే కొమురయ్య, కౌడే చిన్న మల్లయ్యలపై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మట్టి అక్రమంగా తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

మునిపల్లి, జూలై 9: మట్టి అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను రెవెన్యూ, పోలీస్ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. తహసీల్దార్ తెన్మొళి, ఎస్ఐ సురేష్ వివరాల ప్రకారం... మునిపల్లి మండలం మొగ్దుంపల్లి గ్రామ శివారులోని 108 సర్వే నెంబర్‌లో గల భూమిలో అనుమతి లేకుండా సదాశివపేటకు మట్టి తరలిస్తున్నారన్న సమాచారం వచ్చింది. రెండు టిప్పర్లను పట్టుకుని బుదేరా పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

పారిశుధ్య పనులను తనిఖీ చేసిన ఎంపీడీవో

కొల్హారం, జూలై 9: మండల పరిధిలోని సంగాయిపేట, రంగంపేట, తుక్కాపూర్, ఏటిగడ్డమాందాపూర్ గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు మంగళవారం తనిఖీ చేశారు. వర్షాకాలంలో ప్రజలు తీసుకునే జాగ్రత్తల గురించి సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. వర్షాలు పడకముందే రోడ్లు, మురుగు కాలువలను శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో సుమారు 500 నుంచి 1000 ఆయిల్ బాల్స్ తయారు చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

మల్చింగ్ సాగు.. దిగుబడి బాగు

● పెట్టుబడి తక్కువ.. కలుపు సమస్యకు చెక్ ● కూరగాయలు, పండ్ల తోటల సాగుతో ప్రయోజనం



జహీరాబాద్ పరిధిలోని రంజోల్‌లో వంకాయ పంటలో వేసిన మల్చింగ్ షీట్

జహీరాబాద్, జూలై 9 : మారుతున్న కాలానుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులను ఒంటబట్టించుకుని అధిక దిగుబడులు, లాభాలను సాధించేందుకు కొంతమంది రైతులు మొగ్గుచూపుతున్నారు. జహీరాబాద్ ప్రాంతంలో ఎక్కువగా వాణిజ్య పంటలను సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి రాబట్టేందుకు వ్యవసాయాధికారుల సూచన మేరకు మల్చింగ్ పద్ధతిలో పంటలను సాగు చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 500 ఎకరాల్లో మల్చింగ్ షీట్‌సాగు కొనసాగుతుండగా జహీరాబాద్ డివిజన్‌లోనే 300 ఎకరాల వరకు ఉంటుందని అధికారులు వివరించారు.

ప్రయోజనాలు

మల్చింగ్ షీట్ పొలంలో వేయడం మూలంగా నేల ఉపరితలాన్ని కప్పి ఉంచుతుంది. నేలలో తేమను కాపాడుతూ, కలుపు మొక్కల పెరుగుదలను నివారిస్తూ నేలపై ఉష్ణోగ్రతలను నియంత్రిస్తుంది. మొక్కల వేర్లు ఆరోగ్యంగా, ధృడంగా పెరగడానికి దోహదపడుతుంది. వర్షపు నీరు నేరుగా భూమిపైన పడడంతో మట్టి కోతకు గురికాకుండా చేస్తుంది. మల్చింగ్ ప్లాస్టిక్ షీట్లను పరిచిన పొలాల్లో మొక్కలు ఎరువుల్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటాయి. నేలల్లో సూర్యరశ్మి ధారాళంగా ప్రసరించి పంటల తెగుళ్ల వ్యాప్తికి కారణమయ్యే భూమిలో దాగి ఉండే క్రిమికీటకాలు, సూక్ష్మ జీవులు నశిస్తాయని అధికారులు పేర్కొంటున్నారు. మిరప, టమాట, పుచ్చకాయ, కర్బూజ, క్యాప్సికం, కూరగాయలు, పండ్ల తోటలు, పూల మొక్కలను మల్చింగ్ విధానంలో సాగు చేస్తే అధికదిగుబడులు వస్తాయని వ్యవసాయాధికారులు స్పష్టం చేస్తున్నారు.

సాగు విధానం

సాగు చేసే పంటకు సంబంధించి మొక్కల మధ్య దూరాన్ని బట్టి మల్చింగ్ ప్లాస్టిక్ షీట్లను పరవాల్సి ఉంటుంది. మిరప, టమాటా, పుచ్చకాయ, కర్బూజ, క్యాప్సికం, తదితర పంటలను వేసే రైతులు 10 సెంటీమీటర్ల వెడల్పుతో 20 సెంటీమీటర్ల ఎత్తుతో వారి పొలాల్లో బోదెలను తయారు చేసుకోవాలి. ఆనంతరం డ్రిప్ పైపులైన్లను వేసుకుని బోదెలపై మల్చింగ్ షీట్లను వేసి పక్కబాగాల్లో మట్టితో కప్పివేయాలి. మల్చింగ్‌షీట్‌పై రెండు అంగుళాల (6 సెంటీమీటర్ల) దూరం రంధ్రాలు చేసి అందులో విత్తనాలు, లేదా మొక్కలను నాటాలి.

ఎకరాకు రూ.50 వేల ఖర్చు

మిరప, టమాట, పుచ్చకాయ, కర్బూజ, క్యాప్సికం, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, తదితర పంటలకు మల్చింగ్ షీట్‌కు కలిపి రూ.50వేల పైచిలుకు ఖర్చు వస్తుంది. ఎకరాకు 12 వేల మొక్కలు అవసరం. మొక్క ఒక్కటి సుమారు రూ.2 కాగా రూ.24 వేలు ఖర్చు అవుతాయి. మల్చింగ్ షీట్‌కు రూ.14వేలు, ఎరువులకు రూ.12 వేలు అవసరం అవుతాయి. సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపడుతూ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ పంటలు పండిస్తే ఎకరాకు సగటున 15 టన్నుల వరకు టమాటా, గోబీ, క్యాప్సికం దిగుబడి వస్తుంది. మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి ఆదాయం ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో టమాట కిలో రూ.50 వరకు పలుకుతుండగా, పుచ్చకాయ, కర్బూజ, క్యాప్సికం, క్యాబేజీ, క్యాలీఫ్లవర్ ధరలుకూడ కాస్త అదే తరహాలో ఉన్నందున టన్నుకు రూ.60 వేల వరకు ఆదాయం వస్తుంది. దాదాపు ఎకరాకు రూ.8-9 లక్షల వరకు రాబడి ఉంటుంది. ఈ పంటలు కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే చేతికొస్తాయి.



మల్చింగ్ షీట్ విధానంలో పెరిగిన కూరగాయల మొక్కలు

ఈ ఏడాది కొత్తగా వేస్తున్నా



ఈ ఏడాది కొత్తగా మల్చింగ్ విధానంతో సాగుచేస్తున్నాను. మా పక్క పొలాలకు చెందిన రైతులు సాగు చేస్తుంటే చూసి, నాకు ఈ పద్ధతిని పాటించాలనే ఆసక్తి ఏర్పడింది. ప్రస్తుతం మూడు ఎకరాల్లో మల్చింగ్ విధానంతో టమాటా, గోబి పంటలను సాగు చేస్తున్నారు. ప్రారంభ సమయంలో కొంత మేర ఖర్చు అయినప్పటికీ ప్రస్తుతం మాత్రం ఉపయోగంగానే కనిపిస్తుంది.

- సయ్యద్ అహ్మద్, రంజోల్-జహీరాబాద్

లాభాలకు ఢోకా ఉండదు



ఏడాది పొడుగునా ఒక్కటే పంట పండిస్తే నష్టమే ఉంటుంది. మూడు పంటలను వేయాలి. కొద్దిగా కష్టపడి పెట్టుబడి పెడితే లాభాలకు ఢోకా ఉండదు. ప్రస్తుతం 8 ఎకరాల్లో దాదాపు రూ.5 లక్షల పెట్టుబడితో టమాటా పంట వేయగా, పూత దశలో ఉంది. అధికారుల సలహాలు పాటిస్తూ ముందుకెళుతున్నాం. లాభాలు వస్తాయని ఆశిస్తున్నాను.

- మైపాల్‌రెడ్డి, రంజోల్-జహీరాబాద్

మల్చింగ్ విధానంతో ప్రయోజనం



మల్చింగ్ షీట్ విధానంతో సాగుచేస్తే చాలా ప్రయోజనం ఉంటుంది. షీట్ కోసం రైతులకు 50 శాతం సబ్సిడీ ఇస్తున్నాం. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. జహీరాబాద్ ప్రాంత రైతులు ఆధునిక పద్ధతులతో వ్యసాయం చేయడానికి ఆసక్తిని కనబరుస్తున్నారు. వారి ఆసక్తిని బట్టి ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి సందర్శనలు చేపట్టి సలహాలు, సూచనలు చేస్తున్నాం.

-శైలజ, ఉద్యానశాఖ అధికారి

సందేహాలను నివృత్తి చేస్తున్నా..



జహీరాబాద్ ప్రాంత రైతులు వాణిజ్య పంటలను ఎక్కువగా పండిస్తున్నారు. సందేహాలు, సమస్యలుంటే రైతులు నన్ను సంప్రదిస్తుండగా ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నాను. అవసరమైతే క్షేత్రస్థాయికి వెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తున్నాను. రంజోల్ రైతు వేదికలో నిత్యం అందుబాటులో ఉంటా. సరైన సూచనలతో రైతులకు మల్చింగ్ సాగు ఇబ్బందిగా అనిపించడం లేదు.

- ప్రదీప్‌కుమార్, జహీరాబాద్ ఏఈవో



మల్బరీ సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మల్బరీ సాగుతో రైతులకు ప్రయోజనం

జహీరాబాద్, జూన్ 9: మల్బరీ(పట్టు) సాగు చేస్తే రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మండలంలోని మల్‌చెల్మ గ్రామంలో మంగళవారం సెంట్రల్ స్కిల్ డెవలప్‌మెంట్ ములుగు వారి సౌజన్యంతో మల్బరీ(పట్టు) పంట సాగు విధానం, ప్రయోజనాలు, పెట్టుబడి, సబ్సిడీ తదితరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు శాస్త్రవేత్తలు, అధికారులు మాట్లాడుతూ మల్బరీ(పట్టు) పంటకు మార్కెట్లో డిమాండ్ ఉందని, డిమాండ్‌ను బట్టి రైతులు మల్బరీ సాగును పెంచాలన్నారు. సాగుసమయంలో ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే తమను సంప్రదించాలన్నారు. పట్టు పంటను సాగు చేసే రైతులకు ప్రభుత్వ పరంగా అందించే సబ్సిడీల గురించి వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త వినోద్‌కుమార్ యాదవ్, అధికారులు రాఘవేంద్ర, మునిరత్నంరెడ్డి, విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ పాండు రంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగిశెట్టి, రైతులు ఖాజామియా, గౌసొద్దీన్, మల్లిఖార్జున్, నసీరోద్దీన్, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.



పట్టుకున్న గంజాయిని చూపిస్తున్న పోలీసులు

బైక్‌పై గంజాయి రవాణా.. నిందితుడి అరెస్ట్

రామచంద్రాపురం, జూలై 9: బైక్‌పై గంజాయి రవాణా చేస్తున్న నిందితుడిని పోలీసులు పట్టుకుని, అతని నుంచి 1.110 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రామచంద్రాపురం ఎస్ఐ నర్సింహులు కథనం ప్రకారం.. ఒడిస్సాకు చెందిన సరోజ్‌కుమార్ (41) పటాన్ చెరులో ఉంటూ, కూలీలకు గంజాయి అమ్ముతూ సొమ్ముచేసుకుంటున్నాడు. సోమవారం సాయంత్రం బండలగూడకు గంజాయి తరలిస్తుండగా, నిందితుడిని పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి సరోజ్‌కుమార్‌ను రిమాండ్‌కు తరలించామన్నారు.

23 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

గజ్వేల్, జూలై 9: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్న సాగర్ ముంపు గ్రామమైన ఏటిగడ్డ కిష్టాపూర్‌లో అక్రమంగా నిలువ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని గజ్వేల్ పోలీసులు పట్టుకున్నారు. గ్రామంలోని వీరేశ్ కుమార్ అనే వ్యక్తి కిరాణా దుకాణంలో అక్రమంగా బియ్యాన్ని నిలువ ఉంచారన్న సమాచారంతో సోమవారం రాత్రి గజ్వేల్ సీఐ సైదా ఆధ్వర్యంలో దాడి నిర్వహించారు. 23 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు.

చుంచనకోటలో 13 క్వింటాళ్లు

చేర్యాల, జూలై 9: చేర్యాల మండలం చుంచనకోట గ్రామం మీదుగా అక్రమంగా తరలిస్తున్న 13 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం రాత్రి పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ దామోదర్ తెలిపారు. పట్టణ శివారులో తనిఖీ చేస్తున్న క్రమంలో వాహనాన్ని పట్టుకున్నామని తెలిపారు.

అల్ప్రాజోలం పట్టివేత.. ఇద్దరి అరెస్టు



నిందితులను చూపిస్తున్న పోలీసులు

మెదక్ అర్బన్, జూలై 9: అక్రమంగా అల్ప్రాజోలం తరలిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నట్లు ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పిల్లికోటాల్ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా, వెల్దుర్తి మండల పరిధిలోని మంగళపర్తి గ్రామానికి చెందిన సాయికాంత్‌గౌడ్, కలాన్ శెట్టిపల్లి గ్రామా నికి చెందిన అంజాగౌడ్‌లను అరెస్టు చేసి వారి వద్ద 160 గ్రాముల అల్ప్రాజో లం, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నూతన చట్టాల ప్రకారం కేసు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, ఎస్ఐ బాలయ్య, సిబ్బంది చంద్రయ్య , ఎల్లయ్య, రాజు, నరేష్, హరీష్, రవి, నవీన్ పాల్గొన్నారు.

కానరాని వాన జాడ.. ఎండుతున్న పంటలు

నర్సాపూర్, జూలై 9: అదనుదాటుతున్నా వర్షాలు ముఖం చాటేయడంతో నర్సాపూర్ డివిజన్‌లో రైతులు దిక్కుతోచకున్నారు. ఇప్పటికే వేసిన పంటలు ఎండిపోయే దశకు చేరడంతో వరుణుడి కరుణ కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. డివిజన్‌లోని నర్సాపూర్, కౌడిపల్లి, శివ్వంపేట, కొల్చారం, చిలప్‌చెడ్ మండలాలుండగా ఒక్క చిలప్‌చెడ్ మండలంలో మాత్రమే గడిచిన నెలరోజులలో చెప్పుకోదగ్గ వర్షపాతం నమోదు అయింది. మిలిగిన మండలాల్లో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. డివిజన్‌లో మేఘాలు కనిపించడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తుండగా, చిరుజల్లులు తప్ప పెద్ద వర్షపు జాడ లేకపోవడంతో డీలా పడిపోతున్నారు. నర్సాపూర్ మండలంలో జూన్ నుంచి ఇప్పటివరకు 203.8 మిమీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 136.1 మిమీ నమోదైంది. కొల్చారంలో 165.6మిమీలకు 157.8మిమీ, కౌడిపల్లిలో 208మిమీలకు 164.9మిమీ, శివ్వంపేటలో 186.9మిమీలకు 151.7మిమీలతో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు ఇదే డివిజన్‌లోని చిలప్‌చెడ్ మండలంలో మాత్రం సాధారణ వర్షపాతం 211.2మిమీలకు 225మిమీల మేర నమోదై కాస్త మెరుగుగా ఉంది. ఈ వర్షాకాలం ఆశాజనకంగా ఉంటుందని డివిజన్‌లోని రైతాంగం జూన్ మాసంలోనే దుక్కులు దున్ని పంటలు వేసుకున్నారు. అయితే, ఆశించిన వర్షాలు లేకపోవడంతో వేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి కనిపిస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రుస్తుంపేట సమీపంలో వాడిపోయే దశకు చేరిన పంట



శివ్వంపేట సమీపంలో వాడిపోతున్న వరి

బడుల్లో సగం పనులే..!

● బిల్లు తీసుకుని వదిలేసి వెళ్లిన కాంట్రాక్టర్
● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
● ఇదీ.. మన ఊరు మన బడి తీరు

మనోహరాబాద్, జూలై 9: మన ఊరు మన బడి కార్యక్రమం కింద పాఠశాలల్లో చేపట్టిన పనులు సాగుతూనే ఉన్నాయి. కొన్ని చోట్ల కాంట్రాక్టర్లు పనులను అసంపూర్తిగా వదిలేశారు. మండల కేంద్రంలోని మనోహరాబాద్, దండుపల్లితో పాటు పలు పాఠశాలల్లో పనులు ప్రారంభించి వదిలేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం మన ఊరు మన బడి పథకం కింద పలు పాఠశాలల్లో మరమ్మతు పనులు చేపట్టారు. ఇందులో భాగంగా దండుపల్లి పిట్టలవాడలోని ప్రాథమిక పాఠశాలకు రూ. 2 లక్షలకు పైగా నిధులు మంజూరు చేశారు. అయితే, ఈ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సగం బిల్లులు తీసుకుని, పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేసి వెళ్లాడు. పాఠశాలలో సంపు, బాత్‌రూంల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, మధ్యలోనే వదిలేశాడు. తలుపులు తీసుకొచ్చినా బిగించలేదు. సంపుపై మూతలు లేకపోవడంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ విషయమై కాంట్రాక్టర్ సుధాకర్‌ను సంప్రదించగా, మండలంలోని పలు పాఠశాలల్లో పనులు జరుగుతున్నాయని. బిల్లులు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయని చెప్పారు.



మూతలేని సంపు



కాంట్రాక్టర్ వదిలేసి వెళ్లిన తలుపులు

సగం బిల్లు తీసుకున్నారు..



దండుపల్లి పిట్టలవాడ ప్రాథ మిక పాఠశాలలో రెండునెలల క్రితం కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. రెండు లక్ష లకుపైగా నిధులు మంజూరు కాగా, రూ. లక్ష బిల్లు తీసుకున్నారు. ఆ తర్వాత పనులు వదిలేసి వెళ్లిపోయారు. ఫోన్ చేసినా స్పందించడం లేదు. పాఠశాల సంపు, బాత్‌రూంలు, డోర్లు ఎక్కడివక్కడ వదిలేసి వెళ్లారు.

-అన్వర్ జహెనా, ఉపాధ్యాయురాలు

అధ్వానంగా ఉంది..



పాఠశాలలో సగం పనులు చేసి వదిలేయడంతో పరిస్థితి అధ్వానంగా ఉంది. అధికారులకు సమాచారం ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. పాఠశాల డోర్లు, విద్యుత్ మీటర్, సంపు, కిటికీల మరమ్మతులు పూర్తి చేయాలి. కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు వదిలేసి వెళ్లారు.

-జై ప్రకాశ్, ఉపాధ్యాయుడు



సంగాయిపేటలో తాడుతో కట్టేసి ఉన్న యువకుడు

పొలం గట్టు పంచాయతీలో కట్టేసి కొట్టారు..

కొల్చారం, జూలై 9: మెదక్ జిల్లా కొల్చారం మండలం సంగాయిపేట గ్రామంలో పొలం గట్టు పంచాయితీ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య దాడుల్లో ఒకరిని చెట్టుకు కట్టేసి కొట్టారు. మంగళవారం జరిగిన ఈ ఘటన వివరాలు కొల్చారం ఎస్ఐ మహ్మద్ గౌస్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన మొకిరె మల్లయ్య, జెల్ల మల్లయ్యలకు మెదక్-జోగిపేట ప్రధాన రహదారి పక్కనే వ్యవసాయ భూములు ఉన్నాయి. కొంతకాలంగా వీరి మధ్య గెట్టు పంచాయతీ నడుస్తోంది. మంగళవారం జెల్ల మల్లయ్య పొలం హద్దును మొకిరి మల్లయ్య చెరిపేసే ప్రయత్నం చేశాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మొకిరె మల్లయ్య కర్రతో జెల్ల మల్లయ్య తలపై కొట్టడంతో రక్తం కారింది. ఈ విషయం తెలిసి జెల్ల మల్లయ్య కుమారుడు బాలరాజు వచ్చి అక్కడే ఉన్న మొకిరె మల్లయ్య కుమారుడు మొకిరె నర్సింహులును దగ్గరలోనే ఉన్న ప్రైవేటు ఆసుపత్రి ఇనుప పైపులకు తాడుతో కట్టేసి కర్రలతో చితకబాదాడు. విషయం తెలిసి ఏఎస్సై తారాసింగ్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వచ్చి తాళ్లతో కట్టేసిన యువకుడిని విడిపించారు. ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇరువురి పిర్యాదు మేరకు ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహ్మద్ గౌస్ తెలిపారు.

భూతగాదాల్లో ఇరువురి మధ్య ఘర్షణ ఒకరికి గాయాలు



మనోహరాబాద్, జూలై 9: భూతగాదాల్లో ఇరువురి మధ్య ఘర్షణ లో ఒకరు గాయపడ్డారు. ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం ప్రకారం.. మండలంలోని కాళ్లకల్ గ్రామానికి చెందిన వర్గంటి సాయికిరణ్‌రెడ్డి తండ్రి మల్లారెడ్డి సొంత గ్రామమైన కాళ్లకల్‌లోనే నివసిస్తున్నారు. సాయికిరణ్ రెడ్డికి గ్రామంలోని సర్వే నంబర్ 492లో తాతల నుంచి వారసత్వంగా 8 గుంటల భూమి వచ్చిందని మంగళవారం తండ్రికొడుకులు పొలం వద్దకు వెళ్లారు. అయితే, ఆ భూమిలో అప్పటికే కబ్జాలో క్రిష్ణారెడ్డి ఉండగా, ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. దీంతో క్రిష్ణరెడ్డి, అతని కూమారుడు భరత్‌రెడ్డి, మల్లారెడ్డిని, అతని కూమారుడు వర్గంటి సాయికిరణ్‌రెడ్డిలపై చేతులు, కర్రలతో దాడి చేసి తీవ్రంగా కొట్టారు. గాయపడిన మల్లారెడ్డిని ఆస్పత్రిలో చేర్పించిన సాయికిరణ్‌రెడ్డి ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పచ్చని ఒడి.. 'అస్తబల్' గుడి

● ప్రకృతి కోవెలలో కొలువు తీరిన రేణుకా ఎల్లమ్మ తల్లి
● ఆలయానికి ఆషాఢమాసం సందడి

సంగారెడ్డి అర్బన్, జూలై 9 : ఆషాఢ మాసం వచ్చిందంటే చాలు గ్రామ దేవతల ఆలయాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోతాయి. బోనాల జాతర మొదలవుతుంది. వర్షాకాలం ప్రారంభం కావడంతో ఇంట్లో వాళ్లంతా ఎలాంటి అనారోగ్యాలకు గురికాకుండా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ నెలరోజుల పాటు సంగారెడ్డి పట్టణంలోని అస్తబల్ ప్రాంతం సందడిగా మారుతున్నది. ఫలపరిశోధన కేంద్రమైన అస్తబల్ వివిధ రకాల వృక్షాలతో ప్రకృతి రమణీయ ప్రదేశంగా విలసిల్లుతున్నది. ఇక్కడ కొలువైన రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయానికి భక్తులు కుటుంబసమేతంగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని పునీతులవుతారు. మహిళలు బోనం నివేదిస్తారు. కోడిపిల్లలు, మేక పిల్లలను బలిచ్చి మొక్కు తీర్చుకుంటారు. తమను కాపాడమని సుఖ సంతోషాలతో ఉండేలా దీవించమని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకుంటారు. అస్తబల్‌కు వెళ్లేందుకు ముందు భక్తులు పట్టణంలోని నల్లపోచమ్మ తల్లి ఆలయంతో పాటు తాళ్లపల్లి రోడ్డులోని దుర్గామాతను దర్శించుకుని నైవేద్యాలు సమర్పిస్తారు.

భోజనాలకు అనుమతి లేదు

నిత్యం ఉదయం నుంచి సాయంత్రం వరకు అస్తబల్‌లోని పచ్చని ప్రకృతిలో పెద్దలు, పిల్లలు సేదతీరేందుకు అవకాశం ఉన్నప్పటికీ నాలుగేళ్లుగా వనభోజనాలు చేసేందుకు ఫలపరిశోధన అధికారులు అనుమతి ఇవ్వడం లేదు. ఫలితంగా భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏడాదికి ఒకసారి వచ్చే ఆషాఢమాసంలో అయినా వనభోజనాలకు అనుమతించాలని భక్తులు కోరుతున్నారు.



అస్తబల్‌లోని రేణుకా ఎల్లమ్మతల్లి ఆలయం

మొక్కలే పర్యావరణానికి ప్రతిరూపం

● అడిషనల్ డీఆర్డీవో బాల్‌రాజ్



ఎర్ధనూర్‌లో మొక్క నాటుతున్న బాల్‌రాజ్

కంది, జూలై 9 : మొక్కలే పర్యావరణానికి ప్రతిరూపమని అడిషనల్ డీఆర్డీవో బాల్‌రాజ్ పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా కంది మండలపరిధిలోని ఎర్ధనూర్‌లో ఖాళీ స్థలాల్లో, రోడ్లకిరువైపులా మంగళవారం ఆయన మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలన్నారు. మొక్కలు ఎంత ఎక్కువగా ఉంటే గ్రామాలు పచ్చదనంతో కళకళలాడుతాయన్నారు. గ్రామాల్లోని నర్సరీలలో మొక్కలు నాటేందుకు సిద్ధం చేసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట విజిలెన్స్ ఆఫీసర్ నాగేశ్వరావు, ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి మాణిక్యం, సిబ్బంది తదితరులు ఉన్నారు.

'గురుకులం'ను సందర్శించిన అధికారులు



గురుకుల సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

రాయికోడ్, జూలై 9: మండలంలోని అల్లాపూర్‌గ్రామ శివారులో గల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను మంగళవారంజిల్లా మహిళా శిశుసంక్షేమశాఖ అధికారులు శ్రావణ్‌కుమార్‌గౌడ్ స్థానిక ఎంపీడీవో ఎం.ఏ.షరీఫ్ సందర్శించారు. సోమవారం అదే పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని గోడపై నుంచి దూకడంతో తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న విషయం తెలిసిందే. ఈ ఘటన దృష్ట్యా సంగారెడ్డి కలెక్టర్ ఆదేశాల మేరకు గురుకులాన్ని సందర్శించినట్లు వారు చెప్పారు. గాయాలైన విద్యార్థిని హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నట్లు తెలిపారు. హాస్టల్‌లోని విద్యార్థులతో మాట్లాడి వివరాలను సేకరించారు. హాస్టల్ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని వారు హాస్టల్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలోపాఠశాల ప్రిన్సిపల్ మనీపీచంద్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఈ రోడ్లు ఇలా.. వెళ్లేది ఎలా?

● జహీరాబాద్ పట్టణంలో చిరుజల్లులకే చిత్తడవుతున్న రహదారులు ● అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ ● రోడ్లపైనే మురుగు పరుగు



జహీరాబాద్ పట్టణంలో చిన్న వర్షానికే అధ్వానంగా తయారైన వసంతవిహార్ కాలనీకి రోడ్డు, బైపాస్-అల్గోల్ వెళ్లే రోడ్డు, దత్తగిరి కాలనీ రోడ్డు

జహీరాబాద్, జూలై 9: జహీరాబాద్ పట్టణంలో రోడ్లు చినుకుపడితే చాలు చిత్తడిగా మారి నరకాన్ని తలపిస్తున్నాయి. పట్టణంలోని అంతర్గత, ప్రధాన రోడ్లను అభివృద్ధిచేయక పోవడం, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో నిత్యం ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. పట్టణంలో చిరుజల్లులు కురిస్తే చాలు ప్రధానరోడ్లతో పాటు అంతర్గత రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారవుతుంది. రోడ్లపై వర్షపునీరు, మురుగునీటి ప్రవాహంతో ప్రజ లు ఇబ్బందులు అంతా ఇంతా కాదు. అంతర్గత రోడ్ల మరమ్మతులకు నోచుకోని కారణంగా జహీరాబాద్ పట్టణంలోని దత్తగిరికాలనీ, మూసానగర్, చెన్నారెడ్డినగర్, హమాలీకాలనీ, హౌజింగ్‌బోర్డు, రాంనగర్, గాంధీనగర్, వెంకటరమణకాలనీ, అల్లీపూర్, రంజోల్ తదితర ప్రాంతాల్లో రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. ఆయా ప్రాంతాల్లోని రోడ్లపై ప్రజలు కనీసం నడిచి వెళ్లాలంటే సర్కస్‌ఫీట్లు చేయాల్సిందే. ఇక వాహనదారుల పరిస్థితి వర్ణనాతీతం. అంతర్గత రోడ్లు, మురుగుకాలువలు బాగుచేయాలని పలుమార్లు అధికారులకు, నాయకులకు విన్నవించినా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల అభివృద్ధికి సంబంధించి ఎవరికి ఫిర్యాదు చేయాలో దిక్కుతోచక స్థానికులు అయోమయానికి గురవుతున్నారు. వర్షం కురుస్తున్న సమయంలో అత్యవసరంగా బయటకు వెళ్లాల్సివస్తే ఆ తిప్పలు నరకప్రాయమే. రాత్రి వేళల్లో పాడైనరోడ్లపై నడిచివెళ్లాలంటే సాహసాలు చేయకతప్పని దుస్థితి నెలకొందని పట్టణ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వర్షపునీరు, మురుగునీరు నిల్చిఉండడంతో గుంతలు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి నెలకొన్నది. వర్షాలు పడిన సమయంలో తప్పసరిగా బయటకు వెళ్లాల్సివస్తే ఏమాత్రం ఏమరిపాటుగా ఉన్నా గాయాలబారిన పడుతున్నట్టు ద్విచక్రవాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అంతర్గత రోడ్లను, డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అంచెలంచెలుగా సమస్యలకు పరిష్కారం



ఆర్టీసీ కాలనీలో సమస్యలను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

జహీరాబాద్, జూలై 9: జహీరాబాద్ పట్టణంలో నెలకొన్న వివిధ సమస్యలను అంచెలంచెలుగా పరిష్కరించుకుందామని జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ కాలనీ, జర్నలిస్ట్ కాలనీ తదితర ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని పలువార్డుల్లో అంతర్గతరోడ్లు, డ్రైనేజీలు సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం వాస్తవమేనన్నారు. మున్సిపాలిటీకి వస్తున్న ప్రభుత్వ నిధులు, ఇతరత్రా ఆదాయాన్ని ప్రజల అత్యవసరాలను బట్టి ఆయా వార్డుల్లో ఖర్చు పెడుతున్నట్లు వివరించారు. జహీరాబాద్ పట్టణం విస్తరిస్తున్న నేపథ్యంలో పెద్దమొత్తంలో నిధులు అవసరమున్నాయన్నారు. వెంచర్ల ఏర్పాటు సమయంలో నిర్వాహకులు రోడ్లు, డ్రైనేజీలు లేకుండానే అడ్డగోలుగా రాళ్లను పాతి విక్రయించారని, అలాంటి వెంచర్లలో ప్లాట్లను కొనుగోలుచేసి నిర్మాణాలు చేయడం మూలంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అయినప్పటికీ సాధ్యమైనంత వరకు ప్రజలు ఇబ్బందులు పడకుండా తాత్కాలికంగా డ్రైనేజీలను తవ్వి మురుగునీటిని బయటకు పంపిస్తున్నట్టు చెప్పారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంధ్య, మున్సిపల్ సిబ్బంది రవీందర్‌రెడ్డి, ఆయా కాలనీల నాయకులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్త వహించాలి



శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి

జిన్నారం, జూలై 9: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి పేర్కొన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని పోచమ్మ బస్తీలో స్థానికులకు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని రోజారాణి ప్రారంభించారు. ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో డాక్టర్ రాధిక, భవానీ, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



చేగుంటలో బదిలీ అయినవారిని సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

చేగుంట, జూలై 9: మండల కేంద్రంలోని హైస్కూల్ నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు తోటి ఉపాధ్యాయులు మంగళవారం వీడ్కోలు పలికి, సన్మానించారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను నోడల్ ఆఫీసర్ నీరజ పూలమాలలు వేసి శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో చల్లా లక్ష్మణ్, మనోహర్‌రావు, వెంకటేష్, రాజేశ్వర్, సురేందర్, రాధ, రేఖ, సరస్వతి, రమ, శ్రీవాణి, భవాని, రమాదేవి, సుధాకర్‌రెడ్డి, రఘుపతి, తదితరులు పాల్గొన్నారు.

వర్షాధార పంటలపై రైతులకు శిక్షణ

కల్హేర్, జూలై 9: వర్షాధార పంటలైన పెసర, సోయా, మొక్కజొన్న, పత్తి తదితర పంటల సాగు, సస్య రక్షణ చర్యలపై మంగళవారం కల్హేర్ రైతు వేదికలో అధికారులు రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కల్హేర్ ఏవో శ్రీకాంత్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో చేపట్టవల్సిన సస్య రక్షణ చర్యల గురించి వివరించారు. మండల పరిధిలోని క్రిష్ణాపూర్‌లో కూడా పంటల సస్య రక్షణ, పంటల నమోదు చేపట్టారు. అనంతరం ఆయిల్‌పామ్ మొక్కల పెంపకం, వరి పంటను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో ఏఈవోలు సంతోష కుమారి, క్రిష్ణవేణి, మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కేతకీలో పార్కింగ్ వేలం

ఝరాసంగం, జూలై 9: మండల కేంద్రంలోని శ్రీకేతకి సంగమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఈ నెల 10వ తేదీన బహిరంగ పార్కింగ్‌ను వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శశిధర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వేలం పాటలో పాల్గొనాలనే ఆసక్తి కలవారు ముందస్తుగా రూ.50వేలు డిపాజిట్ చేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన వివరించారు.

పూర్వ వీఆర్‌వోల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

● ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి సంఘం నేతల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న సంఘం నాయకులు

పటాన్‌చెరు, జూలై 9: రెవెన్యూ వ్యవస్థకు క్షేత్రస్థాయిలో పట్టుగొమ్మల్లా పనిచేసిన పూర్వ వీఆర్‌వోల సమస్యలను ప్రభుత్వం సానుభూతితో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి ఆ సంఘం రాష్ట్ర నాయకులు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థకు ఆలంబనగా ఉన్న వీఆర్‌వోలను గత ప్రభుత్వం తొలగించిందన్నారు. రీ డెప్లాయిమెంట్ పేరుతో వివిధ శాఖల్లో ఉద్యోగాల భర్తీ చేశారని, వాస్తవానికి ఈ నియామకాల పట్ల పూర్వ వీఆర్‌వోలు పూర్తి అసంతృప్తికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అనేక హక్కులు కోల్పోతున్నామన్నారు. బడ్జెట్ లభ్యతతో వేతనాలు మూడు నాలుగు నెలలకు వేతనాలు ఇవ్వడం వల్ల అనేక ఆర్థిక ఇబ్బందులు వస్తున్నాయన్నారు. మూల వేతనం నుంచి జీపీఎఫ్, సీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ తదితర చెల్లింపులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన 5శాతం ఐఆర్‌కు అర్హులం కావడం లేదని వివరించారు. వ్యవస్థ రద్దు నాటికి సీనియారిటీ ఉన్న వారికి రెవెన్యూ వ్యవస్థలోనే పదోన్నతులు ఇవ్వాలని కోరారు. పూర్వ వీఆర్‌వోల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చినవారిలో సంఘం జిల్లా నాయకులు సత్యనారాయణ, సత్యమ్మ, పాండు, మల్లేశం, విజయ్‌కుమార్, శ్రీనివాస్, నాగయ్య, రాంచంద్రయ్య, నాగేశ్వరావు పాల్గొన్నారు.

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఫ్యాక్టరీ ఉద్యోగులు

కంది, జూలై 9: అన్ని దానాల్లోకెల్లా రక్తదానం గొప్పదని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ సీజీఎం ఎస్ఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. రక్తదాన దినోత్సవంలో భాగంగా సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఎద్దుమైలారం వద్దనున్న మెదక్ అన్ని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలోని సేఫ్టీ హాలులో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి అధికారులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న అన్ని యూనియన్లకు సంబంధించిన ఉద్యోగులు రక్తదానం చేశారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో సేకరించిన రక్తం నిల్వలను ప్రభుత్వ ఆస్పత్రి బ్లడ్ బ్యాంకుకు తరలించారు. ఈ సందర్భంగా సీజీఎం ప్రసాద్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తనిల్వలు ఎంతోమంది ప్రాణాలు నిలబెడతాయన్నారు.ప్రతీ ఒక్కరూ మనవతా దృక్పథంతో రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ రమ్య శ్రీనివాస్‌రావు, రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఖేడ్‌కు బస్సులు మంజూరు చేయాలి



మంత్రి పొన్నంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జూలై 9: ఖేడ్ ఆర్టీసీ డిపోకు 25 కొత్త బస్సులను మంజూరు చేయడంతో పాటు అవసరమైన డ్రైవర్, కండక్టర్లను భర్తీ చేయాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్‌లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రిపొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ప్రస్తుతం డిపోలో ఉన్న బస్సులు నారాయణఖేడ్ ప్రాంత ప్రయాణికుల అవసరాలకు సరిపోక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలోనే బస్సులను కేటాయించడంతో పాటు అవసరమైన మేరకు డ్రైవర్, కండక్టర్లను డిపోకు కేటాయిస్తామన్నారని ఎమ్మెల్యే వివరించారు.

ప్రభుత్వ హామీలు అమలయ్యేలా చూడాలి

● బీజేపీ, అనుబంధ మోర్చాల ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రాలు



సంగారెడ్డిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు



జిన్నారంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సంగారెడ్డి అర్బన్, జూలై 9 : రైతులను కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు ద్వారకా రవి ఆరోపించారు. రైతులకిచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డి తహసీల్దార్ దేవదాసుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులకిచ్చిన హామీలు అమలు చేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేయడాన్ని బీజేపీ కిసాన్‌మోర్చా తీవ్రంగా ఖండిస్తుందన్నారు. రైతు భరోసా పేరుతో ఇచ్చిన హామీని నెరవేర్చలేకపోవడం దురదృష్టకరమన్నారు. కౌలు రైతులకు రూ.15వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యాలయ కార్యదర్శి విజయ్, విష్ణువర్ధన్‌రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి శివ, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

● **జహీరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలయ్యేలా కృషిచేయాలని బీజేపీ జిల్లాకిసాన్‌మోర్చా ప్రధానకార్యదర్శి క్రిష్ణారెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మఠంవిశ్వనాథం తదితరులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలయ్యేలా చూడాలంటు మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ యాదిలాల్‌కు వినతిపత్రం అందజేశారు. హామీల అమలులో నిర్లక్ష్యం చేస్తే బీజేపీ, కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు సుధీర్‌బండారీ, దుర్గయ్య, జగన్నాథం మల్లేశం పాల్గొన్నారు.

● **జిన్నారం:** ప్రభుత్వం ఎన్నికల సమయంలో నిరుద్యోగులు, మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పార్టీ జిల్లా, మండల నాయకులు ప్రతాప్‌రెడ్డి, రాజిరెడ్డి, జగన్‌రెడ్డి, రమేష్, ఆనందకృష్ణారెడ్డి, భవానీ శ్రీనివాస్ తదితరులు జిన్నారంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులు, రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నేటికీ నెరవేర్చలేదని, అమలుకు కార్యాచరణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

● **గుమ్మడిదల:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ మండల బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గుమ్మడిదల తహసీల్దార్ కార్యాలయంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సామల అంజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పలుగు గోవర్ధన్‌రెడ్డితో కలిసి రైతులను ఆదుకోవాలని కోరుతూ తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ గంగాభవానికి వినతి పత్రం అందజేశారు. వెంటనే హామీలను అమలు చేయకపోతే రైతులు తరఫున బీజేపీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పోచుగారి రవీందర్‌రెడ్డి, బుచ్చగారి రాంరెడ్డి, ఐలయ్య, శేఖర్, యాదిరెడ్డి, శివ, రాములు, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ ఏజీపీగా సుధాకర్



నర్సాపూర్, జూలై 9: నర్సాపూర్ జూనియర్ సివిల్‌కోర్టులో ఏజీపీగా పి.సుధాకర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గత కొన్నేళ్లుగా నర్సాపూర్‌కు చెందిన పి.సుధాకర్ న్యాయవాదిగా స్థానిక కోర్టులో పనిచేస్తున్నాడు. కాగా అయనను అసిస్టెంటు గవర్నమెంటు ప్లీడర్(ఏజీపీ)గా ప్రభుత్వం నియమించడంతో ఈ మేరకు బాధ్యతలు తీసుకున్నట్లు తెలిపారు. తనను ఏజీపీగా నియమించిన ప్రభుత్వానికి ఈ సందర్భంగా సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

జహీరాబాద్ ఏజీపీగా నతానీయెల్



జహీరాబాద్, జూలై 9: జహీరాబాద్ జూనీయర్, సీనీయర్ సివిల్‌కోర్టుల అదనపు(ఏజీపీ) న్యాయవాదిగా న్యాయవాది నతానీయెల్‌ను నియమిస్తూ కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులను జారీచేశారు. ఈ సందర్భంగా ఆయనకు కోర్టు ఆవరణలో తోటి న్యాయవాదులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం నతానీయెల్ మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉంటూ, బాధ్యతగా సేవలందిస్తానని పేర్కొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన కాంగ్రెస్ నాయకులు



మంత్రి సీతక్కతో ఆరోపురం, నర్సాపూర్ కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్/రామచంద్రాపురం, జూలై 9: నర్సాపూర్‌కు చెందిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు శేషసాయిరెడ్డి మంగళవారం రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క నర్సాపూర్ నియోజకవర్గంలో గ్రామాల సమస్యల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. సమస్యలు తన దృష్టికి తెస్తే పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు శేషసాయిరెడ్డి తెలిపారు. అదేవిధంగా రామచంద్రాపురం మండల పరిధిలోని ఉస్మాన్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పర్వ శ్యాంరావు కాంగ్రెస్ నాయకులు జి.శ్రీనివాస్, మల్లేశ్, వినోద్, విష్ణు ఇతర నాయకులతో కలిసి మంత్రి సీతక్కను కలిశారు.

మెదక్ డిపో మేనేజర్ బదిలీ

మెదక్ అర్బన్, జూలై 9: మెదక్ ఆర్టీసీ డిపో మేనేజర్ సుధా బీహెచ్ఈఎల్ డిపోకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డీఎం సురేఖను నియమిస్తూ ఆర్టీసీ సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. డీఎంగా సుధా సంవత్సరం పాటు విధులు నిర్వర్తించారు. డీఎం వేధింపులను నిరసిస్తూ ఇటీవల డ్రైవర్లు మూడు రోజుల పాటు శాంతియుత సమ్మెకు దిగారు. ఈ క్రమంలో డీఎం బదిలీ చర్చనీయాంశమైంది.

ప్రభుత్వ, ఆలయ భూములు కాపాడాలి

● తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన కాళ్లకల్ గ్రామస్థులు

మనోహరాబాద్, జూలై 9: కాళ్లకల్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ, దేవాదాయ భూములను కాపాడాలని గ్రామస్థులు తహసీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మండలంలో మేజర్ గ్రామపంచాయతీ అయిన కాళ్లకల్ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ, దేవాదాయ భూమిని సర్వే చేసి హద్దులు చూపించాలని గ్రామపెద్దలంతా కలసి మంగళవారం మనోహరాబాద్ తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసినవారిలో శ్రీనివాస్‌గౌడ్, కమ్మరి వెంకటేష్, నాగరాజు, గోపాల్, చంద్రయ్య, యాదగిరి, గ్రామస్థులు పాల్గొన్నారు.

కోహీర్ ఎంపీవోగా వినోద్‌కుమార్



కోహీర్, జూలై 9: కోహీర్ మండల పంచాయతీ అధికారిగా వినోద్‌కుమార్ మంగళవారం పదవీబాధ్యతలు చేపట్టారు. నిజాంపేట మున్సిపల్‌లో అకౌంటెంట్ పని చేసిన వినోద్‌కుమార్ 2023 అక్టోబర్ 16వ తేదీన కోహీర్ మండల పంచాయతీ అధికారిగా బదిలీపై వచ్చారు. అనంతరం కంగ్టి మండలానికి ఆయన డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఇటీవల ఆయన డిప్యూటేషన్ రద్దు కావడంతో తిరిగి కోహీర్ మండల ఎంపీవోగా వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో భారతి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఎంపీవోగా బాధ్యతలు స్వీకరించిన వినోద్‌కుమార్‌ను శాలువా పూలమాలతో సన్మానించారు.

రెడ్డిపల్లి సొసైటీ మాజీ చైర్మన్ ముత్యంరెడ్డి మృతి

చేగుంట, జూలై 9: మండలంలోని రెడ్డిపల్లి సొసైటీ మాజీ చైర్మన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బస్క్ ముత్యంరెడ్డి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. గతంలో ముత్యంరెడ్డి రెడ్డిపల్లి గ్రామ పీఏసీఎస్ చైర్మన్‌గా పదవీబాధ్యతలు చేపట్టి రైతులకు సేవలందించారు. స్వగ్రామమైన రుక్మాపూర్ ముత్యంరెడ్డి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. అయన మృతిపట్ల పలు రాజకీయ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



సంగారెడ్డిలో ఏబీవీపీ నాయకుల ర్యాలీ, పాపన్నపేటలో ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు

సంగారెడ్డి అర్బన్/నారాయణఖేడ్/ పాపన్నపేట, జూలై 9: ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డిలోని కొత్త బస్టాండ్ వద్ద ఏబీవీపీ జెండాను రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ ఆవిష్కరించారు. అంతకుముందు ఐబీ నుంచి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా కన్వీనర్ ఆకాశ్, నగర అధ్యక్షుడు విఠల్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు రాజు, భారతి, నగర కార్యదర్శి మహేశ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. నారాయణఖేడ్‌లో ఏబీవీపీ పూర్వ నాయకులు ఎన్నం అనిల్ ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏబీవీపీనాయకులు సతీష్‌యాదవ్ బి.సతీష్, పవన్, బీజేపీ కన్వీనర్ రజనీకాంత్, ప్రశాంత్, ఓంప్రకాష్, అశోక్ యాదవ్ పాల్గొన్నారు. అదేవిధంగా మెదక్ జిల్లా పాపన్నపేట మండలకేంద్రంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ఏబీవీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో పాపన్నపేట మండల కార్యదర్శి శ్రీకాంత్, సభ్యులు రాజు, దుర్గాప్రసాద్, జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలి

జహీరాబాద్, జూలై 9: పట్టణంలో కార్మికుల సౌకర్యార్థం 50పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటుచేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 12న చేపట్టనున్న చలో హైదరాబాద్ కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు మైపాల్ తదితరులు మాట్లాడుతు జహీరాబాద్ ప్రాంత కార్మికుల వేతనాల నుంచి ప్రతి నెలా ఈఎస్ఐ బోర్డుకు సుమారు రూ.25లక్షలు అందుతున్నట్టు గుర్తు చేశారు. ఈఎస్ఐ డైరెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తేనే కార్మికుల సమస్యలకు పరిష్కారం లభిస్తుంద న్నారు. జహీరాబాద్ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 50 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఆయా పరిశ్రమల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబీకులకు పరామర్శ

నారాయణఖేడ్, జూలై 9: పూణెలో వారం క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖేడ్ ప్రాంతానికి చెందిన అయిదుగురు మృతి చెందగా, అందులో ఒకరైన ఖేడ్ పట్టణానికి చెందిన రఫీక్‌ఖురేషి ఇంటికి మంగళవారం కల్హేర్ మండలం మార్డికి చెందిన ప్రవాస భారతీయుడు గుర్రపు మశ్చందర్ పలువురు నాయకులతో కలిసి వెళ్లి మృతుడి కుటుంబీకులను పరామర్శించారు. మృతులు పేద కుటుంబాలకు చెందిన వారైనందున వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పరామర్శించినవారిలో మాజీజడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, మార్కెట్‌కమిటీ మాజీ వైస్‌చైర్మన్ బాసిత్, రాష్ట్ర ఆత్మా కమిటీసభ్యుడు కమలాపు రంమారుతి, నాగల్‌గిద్ద మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పండరియాదవ్, గోవింద్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంతోనే గుర్తింపు



మాజీ ఎంపీటీసీ తదితరులను సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ

జిన్నారం, జూలై 9: ప్రజాప్రతినిధులు తమ పదవీకాలంలో చేసిన అభివృద్ధి, అందించిన సేవలే గుర్తింపునిస్తాయని మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం శివానగర్‌లో మాజీ ఎంపీటీసీ సంతోష మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందనసభలో మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, నాయకులు గంగు రమేష్, శ్రీకాంత్‌రెడ్డి, వడ్డె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి

మనూరు, జూలై 9: మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల ప్రత్యేక అధికారి రఘుబాబు పేర్కొన్నారు. మనూరు మండలానికి నూతనంగా నియామకమైన ప్రత్యేక అధికారి రఘుబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించి మనూరులోని ఎంపీపీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అధికారులు బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అలివేలుమంగ, సీనియర్ అసిస్టెంట్ వివేకానంద, ఐకేపీ ఏపీఎం వంశీక్రిష్ణ ఉన్నారు.

హవేళిఘణపూర్ డీటీకి ప్రమోషన్‌పై బదిలీ

హవేళిఘణపూర్, జూలై 9: హవేళిఘణపూర్ డిప్యూటీ తసీల్దార్ ప్రభాకర్ పదోన్నతిపై నిర్మల్ జిల్లాకు మంగళవారం బదిలీ అయ్యారు. ఆరు నెల క్రితం మెదక్ కలెక్టరేట్ నుంచి బదిలీపై ఇక్కడికి ఆయన వచ్చారు. ఇప్పుడు ప్రమోషన్‌పై వెళ్తుండటంతో తహసీల్దార్ నారాయణ, కార్యాలయ సిబ్బంది ఆయనను శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఆబేద్, సిబ్బంది నర్సింహులు, సంతోష్, మహేష్‌చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

గాజుల గూడెంలో వన మహోత్సవం

పాపన్నపేట, జూలై 9: మండల పరిధిలోని గాజులగూడెం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఘనంగా వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిసిరి చెట్ల యొక్క ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు పాట రూపంలో పాడించి వివరించారు. విద్యార్థులు వృక్షాకృతిలో కూర్చుండటం గ్రామస్థులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్, వేణుగోపాల్, గ్రామస్థులు పాల్గొన్నారు.